నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 30 జూన్ 2023

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి పదవ తరగతిలో 9.5 జీపీఏ కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ ఖాళీలు ఉన్నాయని, అడ్మిషన్ కొరకు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ టీసీ, ఆదాయం, కులం, పదవ తరగతి మార్కుల మెమోతో జులై ఒకటవ తేదీ ఉదయం 11 గంటలకు భిక్కనూర్ మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ సమీపంలో ఉన్న గురుకుల పాఠశాల జూనియర్ కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

వివాహిత అదృశ్యం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కల్యాపూర్ గ్రామానికి చెందిన గంగులీ సువర్ణ గత మూడు రోజుల నుంచి కనబడడం లేదని భర్త గంగోని రాజు రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. ఈ నెల 26న ఇంట్లో చిన్న గొడవ జరగడంతో ఆమె నిజామాబాద్ వెళుతున్నట్టు ఇంట్లో చెప్పి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల కుటుంబాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పండ్ల సాయన్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జుక్కల్‌లో ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జుక్కల్ బీఆర్ఎస్‌లో గ్రూపు తగాదాలు నివురుగప్పిన నిప్పులా మారాయి. అది ఏ క్షణమైనా అగ్నిపర్వతంలా పేలే అవకాశం ఉన్నట్టు పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా ఎంపీ, ఎమ్మెల్యే మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. గత మూడు, నాలుగు సంవత్సరాలుగా ఇరువురి మధ్య విబేధాలు నెలకొన్నాయి. స్వంత పార్టీలోనే ఒకరిని తప్పించి మరొకరికి అవకాశం కల్పించాలనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరపున బిచ్కుంద మఠానికి చెందిన సోమాయప్పను బరిలోకి దించాలనే ప్రయత్నం ఎంపీ బీబీ పాటిల్ చేస్తున్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఒకవేళ సోమాయప్ప అసెంబ్లీకి బరిలోకి దించకపోతే బీజేపీ నుంచి ఆయన ఎంపీ స్థానానికి పోటీ చేసే అవకాశముందనే ప్రచారమూ జరుగుతోంది. ఇక కాంగ్రెస్ నుంచి ముగ్గురు పోటీకి సిద్ధపడటం విశేషం. బీజేపీ నుంచి అరుణతార అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధపడుతున్నారు.



- షిండేను తప్పించే యోచనలో ఎంపీ?
- మఠాధిపతిని పార్టీలోకి తీసుకొచ్చే ఆలోచన
- ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో చిక్కులు
- కాంగ్రెస్ నుంచి పోటీకి ముగ్గురు సై
- వేచిచూసే ధోరణిలో బీజేపీ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో నాల్గోసారి అసెంబ్లీలో అడుగుపెట్టాలని భావిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేకు స్వంత పార్టీ నేతల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. షిండేకు ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందనే ప్రచారంతో ఈస్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. ఇందులో బిచ్కుంద మఠానికి చెందిన సోమయప్పను బరిలోకి దించాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. ఆయన ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవసరమైన ఎస్సీ సర్టిఫికేటును కూడా సిద్ధంగా పెట్టుకున్నాడనే ప్రచారం నియోజకవర్గంలో జరుగుతోంది. జుక్కల్ అసెంబ్లీ స్థానం ఎస్సీలకు రిజర్వు అయిన విషయం తెలిసిందే. అదే సమయంలో సోమాయప్పకు ఇటు బీజేపీ నుంచి ఆఫర్లు వస్తున్నట్టు సమాచారం. ఒకవేళ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున అరుణతార పోటీ చేస్తే జహీరాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ నుంచి సోమయప్పను రంగంలోకి దించాలని కమలం పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు. అయితే బీజేపీ నేతల కంటే ముందుగానే ఆయనను బీఆర్ఎస్‌లో చేర్చి అసెంబ్లీ నుంచి బరిలోకి దించాలని ఎంపీ ప్రయత్నం చేస్తున్నట్టు ప్రచారమూ జరుగుతోంది.

కాంగ్రెస్ నుంచి ముగ్గురు పోటీ..

జుక్కల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు ముగ్గురు సిద్ధపడుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ పడ్డ మాజీ ఎమ్మెల్యే గంగారాంతో పాటు నిజామాబాద్‌కు చెందిన సీనియర్ నాయకులు గడుగు గంగాధర్, ఎన్ఆర్ఐ చోటా లక్ష్మికాంతరావు ఈ స్థానం నుంచి టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఇప్పటికే గడుగు గంగాధర్ గత ఆరు నెలలుగా నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. ఏ ఇంట శుభకార్యం జరిగినా అక్కడ వాలిపోతున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ప్రజలకు అందుబాటులో ఉండకపోవడంతో వ్యతిరేకత వస్తుందని, ఈ నేపథ్యంలో ఈసారి పోటీ చేస్తే గెలిచే అవకాశముందని గంగారాం ప్రయత్నం చేస్తున్నారు. పైగా లక్ష్మికాంతరావుకు, గడుగు గంగాధర్‌కు కేడర్ లేదని, పైగా నాన్‌లోకల్ అభ్యర్థులకు ఈ నియోజకవర్గంలో ఓట్లు వేసే అవకాశం లేదని వాదన వినిపిస్తున్నారు. జుక్కల్‌లో దళిత సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉంటాయి. ఆ తరువాత ముదిరాజులు, లింగాయత్‌లు, మున్నురుకాపు సామాజిక తరగతులు బలంగా ఉన్నాయి. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అరుణతార బీజేపీలోకి వచ్చి జుక్కల్ నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈసారి కూడా మళ్లీ ఆమెకు అవకాశం కల్పించాలనే యోచనలో బీజేపీ ఉన్నట్టు సమాచారం. అయితే జహీరాబాద్ ఎంపీ స్థానానికి బలమైన అభ్యర్థి కోసం ప్రయత్నం చేస్తున్నారు. మఠాధిపతి సోమయప్పకు అవకాశం కల్పించాలనే యోచనలో ఉన్నట్టు సమచారం.

ఇతర నియోజకవర్గాలతో పోల్చితే ఈ స్థానంలో ఇంకా ఎన్నికల వేడి రాజుకోలేదు. మిగిలిన నియోజకవర్గాల్లో అధికార, విపక్ష నాయకులు విమర్శలు, ప్రతివిమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నప్పటికీ.. ఈ స్థానంలో అన్ని పార్టీల నేతలు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. ఇక అధికార పార్టీ నుంచి టిక్కెట్టు మళ్లీ తమకు తెచ్చుకునే ప్రయత్నంలో ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నారు. అధిష్టానం వద్ద తమకున్న పలుకుబడి ఉపయోగించి మళ్లీ టిక్కెట్టు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నారు.



బస్సు కోసం జుక్కల్ బస్టాండ్‌లో వేచిచూస్తున్న ప్రయాణికులు

ఇష్టానుసారంగా బస్సు సర్వీసులు రద్దు

సమయ వేళలు పాటించని ఆర్టీసీ అధికారులు

- ప్రయాణికుల్లో గందరగోళం
- బస్సుకోసం గంటతరబడి వేచి ఉంటున్న ప్రయాణికులు

నవతెలంగాణ-జుక్కల్

గ్రామీణ ప్రాంతాలతో పాటు, పట్టణ ప్రాంతాలకు వెళ్లే బస్సులను ఆర్టీసీ బస్సు సర్వీసులను అధికారులు ఇష్టానుసారంగా రద్దు చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురవుతున్నారు. ఏ బస్సు ఏ సమయానికి వస్తుందో తెలియక తికమకపడుతున్నారు. కొన్ని బస్సులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి బస్టాండ్‌లలోనే వేచి ఉంటున్నారు.

జుక్కల్ నుంచి మద్నూర్ మీదుగా దెగ్లూర్ వెళ్లే బస్సు సర్వీసును రద్దు చేశారు. అలాగే బిచ్కుంద నుంచి జుక్కల్ వెళ్లే లోకల్ సర్వీసు బస్సును సైతం రద్దు చేశారు. దీంతో మద్నూర్ నుంచి జుక్కల్‌కు రావాల్సిన ప్రయాణికులు మద్నూర్ బస్టాండ్‌లో గంటల కొద్ది వేచి ఉన్నారు. అయినా బస్సు రాకపోయేసరికి ప్రయివేట్ వాహనాలను ఆశ్రయించి వెళ్లారు. ఇలా రోజువారీ బస్సు సర్వీసులను రద్దు చేయడంతో పాటు, మహరాష్ట్ర, కర్ణాటక అంతరాష్ట్ర బస్సు ట్రిప్పులను సైతం తగ్గించేశారు. రోజులు అధిక ట్రిప్పులు నడపాల్సిన బస్సులను ఒకటి, రెండు ట్రిప్పులు మాత్రమే నడుపుతున్నారు. దీంతో ఏ సమయానికి ఏ బస్సు వస్తుందో తెలియక ప్రయాణికులు గందరగోళానికి గురికావాల్సి వస్తోంది.

కొన్ని రోజుల క్రితం బిచ్కుంద-మాలేగాం బస్సు రాకపోవడంతో దీనిపై డీఎంను ఫోన్ ద్వారా సంప్రదించగా 'అమావాస్య ఉంది కదా. మీకు తెలియదా. సాంప్రదాయంగా ప్యాసింజర్ అమావాస్య రోజు పనులు చేయరు. బస్సు ఎక్కరు. కలెక్షన్ రాదు.' అని బాన్సువాడ డీఎమ్ సదానందం సమాధానం ఇచ్చారు. గతంలో రోడ్డు సరిగా లేదని సాకులు చెప్పే ఆర్టీసీ అధికారులు నేడు పట్టణాలలో రోడ్ల మాదిరిగా గ్రామాల్లోనూ తారురోడ్లు వేసినప్పటికీ ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు నడపడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జుక్కల్ బస్టాండ్‌లో నిలిపిన ప్రయివేటు వాహనాలు

ఘనంగా తొలి ఏకాదశి

- గోరింటాకుతో మహిళల సందడి



గోరింటాకు వేడుకల్లో మహిళలు

నవతెలంగాణ-సదాశివనగర్/బోధన్

మండలంలోని ప్రతి గ్రామంలో గురువారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటిలో పిండి వంటలు చేసుకున్నారు. కొందరు తొలి ఏకాదశి పండుగ నేపథ్యలో ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక తొలి ఏకాదశిని పురస్కరించుకుని మహిళలు గోరింటాకు పెట్టుకున్నారు.

మహిళల గోరింటాకు సందడి..

బోధన్ : ఆషాడ మాసం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బోధన్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో మహిళలు ఆషాడమాసం గోరింటాకు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసంలో మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం మహిళలకు ఇది ప్రత్యేకం. గోరింటాకు అనేది ఔషధ యుక్తమైన చెట్లలో ఒకటి. ప్రధానంగా ఆషాడమాసం మొదటి ఏకాదశికి పండుగ నిమిత్తం మహిళలు తమ సౌభాగ్యంగా భావించి ఇంటింటా ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకుంటారు. శ్రీ వెంకటేశ్వర కాలనీలో గురువారం ఈ ఆషాడ మాసం గోరింటాకు వేడుకలను మహిళలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నందకుమారి, గంగాజలా తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతికి నివాళి

నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ సాయిచంద్ అకాల మరణం చెందడం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని బీఆర్ఎస్వీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు గైక్వాడ్ విలాస్ పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపంగా డోంగ్లి మండలంలోని పెద్దటాక్లి గ్రామంలో గురువారం సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అహేమద్ హుస్సేన్, గ్రామ వార్డ్ మెంబెర్ దిలీప్ కుమార్, వీవోఏ మాధవ్, రవి పటేల్, రామ్ గొండ, మరిబా, యాదవ్, హనుమంత్ సురేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ఘోర రోడ్డు ప్రమాదం

- యువకుడి మృతి
- ఇద్దరికి తీవ్రగాయాలు
- మరొకరికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ముగ్గురు యువకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద యూనియన్ బ్యాంక్ ఎదుట చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎత్తుతండాకు చెందిన బాధవత్ నితీన్, బాధవత్ ప్రవీణ్, దెగవాథ్ రాము ముగ్గురు కలిసి ద్విచక్ర వాహనంపై ఇందల్‌వాయి మండల కేంద్రానికి వెళ్తుండగా.. మార్గమధ్యంలోని టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన ఆగిఉన్న డీసీఎంను వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొన్నారు. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వచ్చి వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో దేగవాథ్ రాము (22) మృతిచెందాడు. కాగా నీతిన్, ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన డీసీఎంను, ద్విచక్రవాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఏడాది క్రితమే పెండ్లి..

తండాలో అందరితో కలిసి మెలిసి ఉండే దేగవాథ్ రాముకు ఏడాది క్రితమే పెండ్లి అయ్యింది. ప్రస్తుతం ఆయన భార్య ఎనిమిది నెలల గర్భవతి. రాము రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆయన మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాము మృతిచెందడం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జైల్లో ఉన్న కొడుకుల కోసం రోధించిన తండ్రి

- ఈద్గా వద్ద ప్రార్థనలు చేసే సమయంలో..



ఖురాన్ తలపై పెట్టుకుని రోధిస్తున్న వృద్ధుడు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ఈద్గా వద్ద గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రార్థనా చేసిన అనంతరం జరిపిన సభలో అబ్దుల్ బాఖీ అనే వృద్ధుడు తలపై ఖురాన్ పెట్టుకుని ఆవేదనతో రోధించడం కలకలం రేపింది. తన కుమారులయిన అల్తాఫ్, నబీద్‌లపై ఎమ్మెల్యే షకీల్ తప్పుడు కేసులు బనాయించి జైలులో వేశారని ఆరోపిస్తూ రోధించారు. మైనారిటీ కౌన్సిలర్లపై తప్పుడు కేసులు చేయించి తమ కుమారులను తమతో పండుగ జరుపుకోనీయకుండా తమ నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈద్గా సభలో అతి పవిత్రమైన ఖురాన్ తలమీద పెట్టుకొని కంట తడి పెట్టుకున్నారు. బోధన్‌లో అభివృద్ధిపై ప్రశ్నిస్తే తమ కొడుకులపై అక్రమ కేసులు పెట్టి తమ నుంచి దూరం చేయడం సరికాదని రోదించారు.

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్‌సెర్చ్

- బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్‌సెర్చ్ బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోచారం తండాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రజలతో మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేయడం, పండించడం నేరమని తెలిపారు. ఎవరైనా గంజాయిని పండించినా, రవాణా చేసినా రవాణా చేసే వారికి, సహాయపడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తండాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు గానీ, నేరస్తులు గానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని తెలిపారు. నేర రహితంగా మార్చేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డి, బిచ్కుంద ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి, పిట్లం ఎస్సై విజయ్ కొండ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ షబ్బీర్ అలీకి భిక్కనూర్ కాంగ్రెస్ మండల నాయకులు కామారెడ్డిలోని ఆయన నివాసంలో బక్రీద్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, నాయకులు సుధాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సురేష్, లింగారెడ్డి, తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పోడు పట్టాల పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మాలోత్ సంగ్యనాయక్ తాండ (ఎక్కపల్లి తాండ)లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ చేతుల మీదుగా పోడు భూముల పట్టాల పంపిణీ చేపట్టనున్నట్టు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు దివిటీ రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దుక్కి దున్ని.. విత్తనం వేసి..



ఎడ్లసాయంతో భూమిని దున్నుతున్న రైతు



విత్తనాలు వేస్తున్న రైతులు

- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీబిజీ అయ్యారు. గత రెండు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో రైతులు ఎడ్ల సాయంతో నాగలి చేతపట్టి దుక్కి దున్ని విత్తనాలు వేస్తున్నారు. ఇక ఎడ్లు లేని వారు ట్రాక్టర్ల సాయంతో దుక్కి దున్నిపించి విత్తనాలు విత్తుతున్నారు. దీంతో రైతులకు తీరికలేకుండా పోయింది. జూన్ మొదటి వారంలోనే విత్తనాలు విత్తాల్సి ఉండగా.. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడం.. వర్షాలు మూడు రోజుల నుంచి అడపాదడపా కురవడంతో పనులను ప్రారంభించారు. అంతే కాకుండా రైతులు చేనులో ఉన్న బోరు బావుల వద్ద వరి నాటు విత్తడానికి పొలాలను సిద్ధం చేసుకొని వరి నాటు వేయడానికి రైతులు దుక్కి దునిపిస్తున్నారు. గతేడాదిలా ఈ సారి కూడా వర్షాలు సమృద్ధిగా కురిస్తే పంట పొలాలు సమృద్ధిగా పండుతాయని



గ్రూపు-4 పరీక్షలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు

ఆర్‌టిసి డిపో మేనేజర్ కవిత

నవతెలంగాణ-ఆర్మూర్

జులై 1న శనివారం జరగబోయే గ్రూప్4 పరీక్షలకు ప్రత్యేక బస్సులను నడుపుతామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్మూర్ డిపో మేనేజర్ కవిత గురువారం తెలిపారు. ఆర్మూర్ నుంచి నిర్మల్, మెట్‌పల్లి, నిజామాబాద్, ఆర్మూర్ నుంచి పిప్రి జూనియర్ కాలేజ్ , క్షత్రియ కాలేజ్ ఎగ్జామ్స్ సెంటర్ వరకు ఉదయం 6 గంటల నుండిపరీక్ష సమయం వరకు, పరీక్ష ముగిసిన అనంతరం గమ్యస్థానాల వరకు ప్రత్యేక బస్సులు నడుతామని చెప్పారు. బస్సు వివరాలు తెలియజేయడానికి బస్టాండ్‌లో ప్రత్యేక సిబ్బందితో హెల్ప్ డెస్క్ కౌంటర్ ఏర్పాటు చేస్తామని డిపో పరిధిలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్నారై (బెహరాన్) జక్రాన్‌పల్లి మండల అధ్యక్షులుగా జగడం రవి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఎన్నారై (బెహరాన్) జక్రంపెల్లి మండల అధ్యక్షులుగా జగడం రవిని నియమించినట్లు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు సొప్పరి వినోద్ తెలిపారు. జగడం రవి మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని తెలిపారు. బీసీ ఎన్నారై లకు ఎటువంటి సమస్యలు వచ్చిన వారికి అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో బట్టు స్వామి ఎన్నారై బీసి సభ్యులు పాల్గొన్నారు.



తొమ్మిది వేలు దాటిన పసుపు ధర

మేలురకం పసుపునకు రూ.10వేలకు కొనేందుకు ఆసక్తి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

గత సీజన్లో కురిసిన భారీ వర్షాల వల్ల పసుపు రైతులకు సరైన ధర, దిగుబడి రాక నష్టపోయారు. కాగా పసుపునకు ఇప్పుడిప్పుడే మంచి ధర పలుకుతుంది. గత వారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు ధర 9269 రూపాయలు పలికింది. స్పైస్ బోర్డ్ ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఈ సీజన్లో ధర తక్కువున్న కారణంగా రైతులు కోల్డ్ స్టోరేజ్లలో నిల్వ చేసుకున్నారు. ఇప్పుడిప్పుడే పసుపు ధరలు కొంత మేరకు ఆశాజనకంగా ఉండడంతో రైతులు అమ్మేందుకు మార్కెట్ యార్డుకు తీసుకొస్తున్నారు. ఏర్గట్ల మండలం దోంచంద, జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నంకు చెందిన రైతులకు 9200 -9300 వరకు ధర పలికింది. దీంతో కోల్డ్ స్టోరేజ్లలో నిలువ చేసుకొని ఇప్పుడు అమ్ముకున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అటు వ్యాపారస్తులు కూడా ప్రస్తుతం రేట్లు ఆశాజనకంగా ఉన్నాయని, మేలైన పసుపు ఉంటే పదివేల ధరకు కూడా కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు.

త్యాగస్ఫూర్తికి ప్రతీక బక్రీద్

- ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- ఘనంగా బక్రీద్
- ఈద్గాల వద్ద ప్రార్థనలు

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి:డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాలతోపాటు గ్రామాలలో గురువారం ఈద్-ఉల్ అద్హాను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కొన్ని రోజులుగా జల్లులు కురుస్తుండటంతో పండగ రోజు కూడా వర్షాలు వస్తాయని అనుకుని ఆయా గ్రామాలలోని మస్ జీద్‌లలో ఏర్పాట్లు చేశారు. వేకువ జాము నుంచి వర్షం పడక పోవడం, ఎండ ఉండటం వల్ల గ్రామ పొలిమేరలో ఉన్న ఈద్గాల వద్దనే మస్‌జీద్ కమిటీ సభ్యులు ప్రత్యేక నమాజ్ చేశారు. హాఫిజ్ ఎం. ఖురాన్, మౌల్వీలు ఈద్-ఉల్-అద్హాను ఉద్దేశించి ఖురాన్‌ను చదివి వినిపించారు. అందరు కలిసి మెలిసి ఉండాలని దువా చేశారు. అనంతరం ఒకరికి ఒకరు ఈద్ ముబారక్ అంటు ఆలింగనం చేసుకున్నారు. కులం మతం భేదం లేకుండా ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి ఈద్గాల వద్ద తమ తండ్రులు,అన్న తమ్ముళ్లతో కలిసి పాల్గొన్నారు. తమ పూర్వికుల సమాధుల వద్ద కు వెళ్ళి వారిని స్మరించుకుని సమాధులపై పూలను ఉంచి నివాళులర్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చొరవచూపి ఎవరికి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కార్యక్రమంలో మస్ జీద్, ఈద్గా కమిటీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, షేక్ నయీమ్, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి :తిర్మన్‌పల్లి గ్రామంలోని ఈద్గా వద్ద ముస్లిం ప్రార్థనలు



డిచ్‌పల్లి : ప్రార్థనల్లో పాల్గొన్న చిన్నారులు

కమ్మర్‌పల్లి : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపు కున్నారు. బక్రీద్ పండుగను పురస్కరించు కొని ఉదయం ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా పలువురు ముస్లిం కుటుంబాల వారు ఇరుగుపొరుగు కుటుంబాల వారికి స్వీట్స్ ను పంపిణీ చేశారు.



కమ్మర్‌పల్లి : ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఆర్మూర్ :త్యాగస్ఫూర్తికి అత్యున్నత భక్తికి ప్రతీక బక్రీద్ అని ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని పాటు వివిధ చోట్ల దర్గాల వద్ద జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భక్తి, త్యాగం కరుణ విశ్వాసం అనే గొప్ప గుణాలను బక్రీద్ పెంపొందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, బీఆర్ ఎస్ నాయకులు కాంగ్రెస్ శ్రీనివాస్, పండిత్ పవన్, మర్కజ్ కమిటీ అధ్యక్షులు మోహినుద్దీన్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నేడు ఎంవి.ప్రసాద్ వర్ధంతి

- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కామ్రేడ్ ఎం.వి ప్రసాద్ వసంత కల వర్ధంతి సభ జరుగుతుందని సిపిఐ (ఎంఎల్) రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ. కార్యదర్శి సుధాకర్ గురువారం.తెలిపారు. ఎన్‌వి ప్రసాద్ భారత విప్లవ ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. నిరంతరం ప్రజా పోరాటాల్లో ముందు నడిచి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ సాయుధ పోరాటం వైపు పయనమయ్యాడని తెలిపారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అనేక నిర్బంధాలను ఎదుర్కొంటూ అక్రమ అరెస్టులు జైలు జీవితాలను సైతం లెక్కచేయక ప్రజా ఉద్యమ పోరు బాటలో ముందుకు సాగుతున్న క్రమంలో జులై 18న మామూళ్ల గూడెం టోల్గేట్ దగ్గర కాల్చి చంపబడ్డాడని తెలిపారు. ఆయన కన్నకలల్ని నిజం చేయాలని ఆయన వేసిన బాటలో ముందుకు నడవాలని ఆయన ఆశయ సాధన కోసం పోరాడాలని అన్నారు

రక్తదానం చేసిన మహిళ కండక్టర్

నవతెలంగాణ-ఆర్మూర్



స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ ఆర్టీసీ-2 డిపో కండక్టర్ లలిత గురువారం రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. సాటి మనుషులకు సాయం చేస్తూ వారి కళ్ళల్లో ఆనందాన్ని వెతుక్కుంటున్న లలిత స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొట్ట మొదటిగా మహిళ గా రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు.

మాందాపూర్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మాందాపూర్ గ్రామంలో గ్రామ యువత ఆధ్వర్యంలో "ఇంటికి ఒక రక్త దాత నినాదంతో గురువారం స్వచ్ఛంద రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛందంగా 54 మంది యువకులు రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ నిజామాబాద్ జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, సర్పంచ్ సులోచన, మాక్లూర్ చైర్మన్ గంగారాం, రవి తదితరులు పాల్గొన్నారు.

కోటార్మూర్ వీడీసీ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ గ్రామ అభివృద్ధి నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్టు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇట్టెడి గంగారెడ్డి గురువారం తెలిపారు. గత ఏడాదికి సంబంధించిన వీడీసీ సభ్యులు గత సంవత్సర ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. కోశాధికారిగా తిరుపతిగౌడ్, కార్యదర్శిగా కార్తీక్, సభ్యులుగా గోపిడి సంజీవ్‌రెడ్డి, కుంట విద్యాసాగర్ గౌడ్, లక్కారం నరేందర్, లింబాద్రి, స్వామి, వీరయ్య, నక్క మహేష్, గంగారం ఉన్నారు. గ్రామాభివృద్ధికి తమ శాయశక్తుల కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే బిగాలకు ప్రజా సమస్యలు పట్టవా



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎమ్మెల్యే బిగాలకు ప్రజాసమస్యలు పట్టవా అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ రేణుక నగర్, ఆనంద్ నగర్‌లో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చిరంజీవి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అభివృద్ధి ఎక్కడి వేసిన గొంగడి అక్కడే ఉందని, డివిజన్ ప్రజల సమస్యలు పట్టించుకోవడంలేదని తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. డ్రైనేజీ వ్యవస్థతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, రెండు రోజుల్లో పార్కు స్థలాలను కోనేరు స్థలాలను శుభ్రం చేయకపోతే డివిజన్ వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని అన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు, పార్కు స్థలాన్ని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కమిషనర్‌ను కోరారు.. గణేష్ గుప్తాకు అభివృద్ధి మీద ఏ మాత్రం శ్రద్ధ లేదు అని, నగర ప్రజలు సరైన బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రంజిత్, వినోద్, సందీప్, రంగ పంతులు, శ్రావణ్, సతీష్, రాములు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

చేపూర్ దత్తసాయి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ దత్తసాయి ఆలయంలో గురువారం పెర్కిట్ బట్టు నరేందర్, పుష్పలత వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసి బాల నర్సయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, గౌరవ అధ్యక్షులు, కోశాధికారి సురేష్, రుక్మాజీ మాట్లాడుతూ... ప్రతీ గురువారం దత్త సాయి సన్నిధానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించాలనుకున్నవారు కమిటీ క్యాషియర్ సురేష్ రుక్మాజి నం:9885061261కు ఫోన్ చేసి సంప్రదించాలని తెలిపారు. ఆలయ కమిటీ వారికి 6,000/- రూపాయలు చెల్లించిన వారి పేరు మీద అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో పెళ్ళిళ్ల,శుభ కార్యాలు చేసేవారి కొరకు ప్రత్యేకంగా కళ్యాణ మండపం, వంటగది, నీటి వసతి, టాయ్‌లెట్స్, వగైరా సౌకర్యాలు కూడా ఉన్నాయన్నారు. ఎవరైనా తక్కువ ఖర్చులతో శుభాహార కార్యక్రమాలు నిర్వహించుకునేవారు సురేష్ రుక్మాజిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో దత్త సాయి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ .అశోక్, ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్, సలహాదారులు కత్తి శ్రీను, బి.సాయన్న, ఎం.గిరీష్, దేవిదాస్, స్వామిదాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు,చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రూ.3లక్షల ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-బాల్కొండ (కమ్మర్‌పల్లి)

బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బండి పెద్ద మల్లయ్య యాదవ్ గుండె సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈవిషయం స్థానిక నాయకులు రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో గుండె ఆపరేషన్ కొరకు రూ. 3లక్షల ఎల్ఓసి మంజూరు చేయించారు. గురువారం హైదరాబాద్ లోని మంత్రుల నివాసంలో రూ.3 లక్షల ఎల్ఓసి కాపీని బాధితుడి సోదరుడు బండి నడ్పి మల్లయ్యకు మంత్రి అందజేశారు. కార్యక్రమంలో భూస నరహరి, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల విద్యా సాగర్ పాల్గొన్నారు.



ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి

డీఈవో పక్షపాత వైఖరిని ఖండిస్తున్నాం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా విద్యాశాఖ అధికారి పక్షపాత వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతన్ జిల్లా కార్యదర్శులు రాజన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో పక్షపాతం, కక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రెండు ఘటనలు పరిశీలించినప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి వచ్చిన మరుక్షణమే సస్పెన్షన్ వేటు వేయవలసిన తన కార్యాలయం సిబ్బంది (ఎస్టాబ్లిష్మెంట్ జూనియర్ అసిస్టెంట్) విషయంలో మిన్నకుండడం, ఈ ఉద్యోగి ఏకంగా జిల్లా విద్యాశాఖ అధికారికి 5వేలు లంచం ఇస్తే డిప్యూటేషన్ ఆర్డర్ రద్దు చేయిస్తానని వాయిస్ రికార్డింగ్ వైరలైనప్పటికీ ఉపేక్షించడంలో పలు అనుమానాలకు తావిస్తోందని తెలిపారు. లంచం అడిగిన వ్యక్తికి డీఈవో బాసటగా నిలవడం విమర్శలకు తావిస్తుందని తెలిపారు. పెట్టిన డిప్యూటేషన్లు పూర్తిగా అక్రమమని, ఇటువంటి ఉత్తర్వులు వెలువడుటకు కారకులైన వారిపై ఎటువంటి చర్యలకు ఉపక్రమించకపోవడం డిఇఓ పక్షపాత వైఖరిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఎస్ఎంసి తీర్మానం మేరకు యూనిఫాంలు కుట్టడానికి కొంత మొత్తం విద్యార్థుల నుండి వసూలు చేశాడని పడగల్ ప్రధాన ఉపాధ్యాయున్ని అగ మేఘాల మీద సస్పెండ్ చేయడం సరేంది కాదని, ఈ విషయంలో డిపార్ట్మెంటల్ విచారణ జరిపి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ అత్యుత్సాహం ప్రదర్శించి సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సదరు ప్రధానోధ్యాయుడు ఒక ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర నాయకుడిగా ఉండి విద్యాశాఖలో అవినీతి అక్రమాలను ఖండిస్తు యూఎస్పిసి పక్షాన ఫిర్యాదులు చేస్తున్నాడనే అక్కసుతోనే ప్రతికారంగా ఈ సస్పెన్షన్ చర్యగా అగుపిస్తుందని పేర్కొన్నారు.

కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-మోర్తాడ్

ముదిరాజ్ కులస్తులను అవమానంగా హేళన చేస్తూ మాట్లాడిన ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర మహాసభ బాల్కొండ నియోజకవర్గం అధ్యక్షుడు జక్కం అశోక్ అన్నారు. మండలంలోని ముదిరాజ్ కులస్తులు జాతీయ రహదారి 63 పై గురువారం నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. 24 గంటల లోపు క్షమాపణ చెప్పకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్ కులస్తుల తరపున ఉద్యమం చేపట్టే ప్రయత్నం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, శ్రీధర్, సంతోష్, మోర్తాడ్ మండల ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న ముదిరాజ్ కులస్తులు

విఠలేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలకేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ రుక్మిణీ పాండురంగ విఠలేశ్వర ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల, బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేష్ బిగాల వారి కుటుంబ సభ్యులు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. ఏకదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, చుట్టుప్రక్కల గ్రామస్తులు విఠలేశ్వరున్ని దర్శించుకుని, భజన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్ కుమార్, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

కంఠేశ్వర్:నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల నాందేవ్ వాడలో గల విఠలేశ్వర ఆలయంలో వినాయక్ నగర్ లోని దత్త ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్,సత్య ప్రకాష్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రజాగాయకుడు సాయిచందుకు నివాళులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రజా గాయకుడు సాయిచంద్ గుండెపోటుతో అకాల మరణం చెందడం విచారకరమని, ఆయనకు నివాళి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని అరుణోదయ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు నాగన్న కార్యదర్శి దాస్ గురువారం తెలిపారు. సాయిచంద్ విద్యార్థి దశలో పిడిఎస్యు నాయకుడిగా, అరుణోదయ కళాకారుడుగా పనిచేశాడని వారు తెలిపారు. ప్రజా సమస్యలపై పాటలు రచించి, గానం చేయడమే కాకుండా తెలంగాణ ఉద్యమంలో తన పాట మాటతో ప్రజల్ని ఆకట్టుకున్నారని పేర్కొన్నారు.

ప్రజలే తగిన గుణపాఠం చెప్తారు

- అభివృద్ధిని అడ్డుకోవడానికి విపక్ష నేతల కుట్రలు
- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్న కాంగ్రెస్, బిజెపి విపక్ష నేతలకు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలైన మానాల మోహన్ రెడ్డి, సునీల్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి మంత్రి ప్రశాంత్ రెడ్డి పై అవాకులు చివాకులు పేలుతున్నారని పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, భవన నిర్మాణాలు నిలిచిపోయి అభివృద్ధి కుంటుపడాలనే ఉద్దేశంతోనే కప్పల వాగు ఇసుకపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. పనులు జరగకుండా అడ్డుకోవడం ద్వారా నియోజకవర్గంలో మంత్రిపై వ్యతిరేకత తీసుకురావాలన్న దురుద్దేశంతో క్రషర్, కంకర, ఇసుక అడ్డుకోవడానికి మంత్రి కమిషన్లు తీసుకుంటున్నాడంటూ అబద్ధం ప్రచారం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ఈరవత్రి అనిల్ మానాల గ్రామంలో వేసిన సీసీ రోడ్ల శిలాఫలకాలు అలాగే ఉన్నాయని, పనులు మాత్రం జరగలేదని వాటి కోసం మంజూరైన నిధులు ఏమయ్యాయి అని ప్రశ్నించారు. ఓట్ల కోసం సంవత్సరాలుగా హామీ ఇచ్చి మర్చిపోయిన మానాల- మరిమడ్ల రోడ్డు పనులు మంత్రి ప్రశాంతి రెడ్డితో సాధ్యమైందన్నారు. తరచూ నిరాధార ఆరోపణలు చేస్తే కాంగ్రెస్, బిజెపి నాయకులకు సమయం చూసి ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు, అన్ని వర్గాలకు పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందుతుంటే కళ్ళుండి చూడలేని కబోదిలా కాంగ్రెస్, బిజెపి నాయకుల పరిస్థితి తయారయ్యిందన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ ప్రజల్లో ఉనికిని కాపాడుకోవాలని చూసే నాయకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.నిరంతరం మంత్రిపై బుడదజల్లుతూ, అభివృద్ధి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తూ ప్రతిపక్ష నాయకులు స్థాయిని తగ్గించుకోవద్దన్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు మంత్రిపై అసత్య ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ లు గడ్డం స్వామి, పుప్పాల గంగాధర్, పెండే ప్రభాకర్, మారు శంకర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, చౌట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాపరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలావత్ ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగుంట దేవేందర్

సాయి చంద్ మృతి తీరనిలోటు

నవతెలంగాణ-బోధన్

రాష్ట్ర గిడ్డంగి సంస్థ చైర్మెన్, ప్రముఖ ప్రజా గాయకుడు సాయిచంద్ అకాల మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని బోధన్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన ఆట, పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన కళాకారుడు, తన పాటతో ఎన్నో హృదయాలను కదిలించిన గాయకుడు సాయిచంద్ గళం మూగబోవడం బాధాకరమన్నారు. 'దివికేగిన తెలంగాణ ఉద్యమ కెరటం.. మీ మరణం యావత్తు తెలంగాణకే తీరని లోటు' అని అన్నారు.

మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతాం



● లయన్స్ ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రావు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండలంలో మరిన్ని ఉచిత సేవలందించి గ్రామీణ ప్రాంత ప్రజల మన్ననలను పొందుతామని లయన్స్ క్లబ్ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి కదం ప్రకాష్‌రావు అన్నారు. 2023-24 సంవత్సరానికి గాను లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ అధ్యక్షురాలిగా మెర్సీ, ప్రధాన కార్యదర్శిగా కదం ప్రకాష్‌రావు, కోశాధికారిగా, బంజశంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఏడాది పాటు పని చేస్తుంది. లయన్స్ జిల్లా మెంబర్‌షిప్ సమన్వయకర్త కరటూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఎంపికను చేశారు. గ్రామాలలో సామాజిక సేవతో తాము పేదలకు అండగా నిలుస్తామని నూతన కమిటీ పేర్కొంది.

ఘనంగా బక్రీద్ వేడుకలు

● ఈద్గాల వద్ద ప్రార్థనలు చేసిన ముస్లింలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు గురువారం బోధన్ మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని నర్సిరోడ్‌లో గల ఈద్గా వద్ద ముస్లింలు భారీ సంఖ్యలో హాజరై సామూహిక ప్రార్థన నిర్వహించారు. పలుచోట్ల ముస్లిం సోదరులు మసీదులో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోధన పట్టణంలో మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, సిఐ ప్రేమ్ కుమార్ మైనారిటీలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

లింగంపేట్ : బక్రీద్ పండుగ పర్వదినం పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలలో ముస్లింలు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మదర్ సన్ నిర్వాహకులు అబుల్ హసన్ రిజ్వీ మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. సంవత్సర సంపదలో సగభాగం పేదలకు ఖర్చు చేయాలని ఆయన సూచించారు. అనంతరం సమాధుల వద్దకు వెళ్లి పూలు చల్లి పెద్దలను తలుచుకున్నారు. రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, భారీ నీటిపారుదల శాఖ జలమండలి సభ్యులు మహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి ఆయన కుమారులతో తల్లిదండ్రుల సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేదలకు తోచినంత సాయం చేశారు.



మద్నూర్ : రంజాన్ వేడుకల్లో ముస్లింలు



లింగంపేట్ : సీనియర్ న్యాయవాది ఖాద్రి ప్రార్థనలు

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మండలంలోని ధర్మారావుపేట్, అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజివాడి, సదాశివనగర్, కల్వరాల్, కుప్రియాల్, మర్కల్, ఉత్నూర్, తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో పాటు పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థన చేశారు.

రెంజల్ : మండలంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల నిర్వహించారు. ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా రెంజల్ ఎస్ఐ పండ్ల సాయన్న ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గాంధారి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండలంలోని చిన్నశక్కర్గ గ్రామంలో సర్పంచ్ షేక్ గఫర్ ఆధ్వర్యంలో ముస్లిములు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో శాంతియుతంగా జరుపుకున్నారు.



గాంధారిలో..



రెంజల్‌లో..



సదాశివనగర్‌లో..

రైతులు కొనుగోలు చేసే ప్రతిదానికీ రసీదు ఇవ్వాలి

● ఏవో హరీష్ కుమార్



దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏవో

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు కొనుగోలు చేసే విత్తనాలకు, ఎరువులకు, క్రిమిసంహారక మందులకు దుకాణదారుడు తన సంతకంతో కూడిన రసీదు అందజేయాలని ఏవో హరీష్ కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని పలు విత్తన డీలర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ మాట్లాడుతూ.. లేబిల్ ఉన్న విత్తన బ్యాగులను విక్రయించాలని, ఎక్కువ మొత్తంలో కుల్లాగా విత్తనాలను విక్రయిస్తే పిడి యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల్లో నిలువ, ధర పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు తప్పకుండా కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువుల వివరాలతో తప్పకుండా రసీదు తీసుకోవాలని సూచించారు.

గుంతలను పూడ్చిన జీపీ సిబ్బంది



గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ బస్టాండ్ ప్రాంతం నుంచి గ్రామ చివరి వరకు రహదారి వెంట వర్షం నీళ్ల గుంతలో నిలవకుండా ఉండేందుకుగానూ గ్రామపంచాయతీ సిబ్బంది దస్తుతో గుంతలను పూడ్చివేశారు. గుంతలలో నీరు ఆగి ప్రజలకు ఇబ్బందులు కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. స్థానిక సర్పంచ్ బట్టు హనుమాన్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామస్తులకు ఇబ్బందులు కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. బస్టాండు ప్రాంతం నుంచి గ్రామ చివరి వరకు సుమారు కిలోమీటర్ పొడవున అక్కడక్కడ ఏర్పడ్డ గుంతల్లో కాంక్రీట్ డస్ట్ వేయించారు. వర్షపు నీరు నిలవకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నారు. బిల్ కలెక్టర్ పద్మావతి, వాటర్‌మేన్ కుంట సంతోష్, గారిగింట్ల శ్రీనివాస్, గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు నవీన్, లింగం తదితరులున్నారు.

కన్నుల పండువగా లక్ష్మినరసింహ స్వామివారి కళ్యాణం



కల్యాణంలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల శివారులో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వాతి నక్షత్రం సందర్భంగా స్వామివారి కళ్యాణం కన్నుల పండగలా సాగింది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి శ్రీ లక్ష్మీనరసింహస్వామి గర్భగుడిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తెచ్చుకున్నారు. అలాగే తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఈవో వేణు, జూనియర్ అసిస్టెంట్ రఘు, వేద పండితులు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామకపత్రాన్ని అందజేస్తున్న షబ్బీర్‌అలీ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి నియామకమైనట్టు కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లా పెద్దలు మాజీ మంత్రి షబ్బీర్ అలీ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాల కోసం రైతులను తప్పు దోవ పట్టిస్తున్నారు

● బీఆర్ఎస్ నాయకుల స్పష్టీకరణ

నవతెలంగాణ-రెంజల్

కొందరు స్వప్రయోజనాల కోసం రైతులను తప్పుదోవ పట్టిస్తూ రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారని రెంజల్ బీఆర్ఎస్ మండల నాయకులు స్పష్టం చేశారు. గురువారం రెంజల్ మండల కేంద్రంలో వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రెంజల్, మాచవరం రోడ్డుతో పాటు దూపల్లి ఎక్స్‌రోడ్ల మరమ్మతుల కోసం స్థానిక ఎమ్మెల్యే షకీల్ అమీర్ 20 రోజుల కిందట రైతులకు ఇబ్బంది కలుగుతుందన్న భావంతో మరో కాంట్రాక్టర్‌ను పిలిపించి ఈ రోడ్లకు మెజర్మెంట్ చేయించి ప్రొసీడింగ్ మంజూరు చేయించారని వారన్నారు. 20 లక్షల రూపాయల వ్యయంతో గ్రావెల్ వేయడానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈనెల 6న అధికారులతో సర్వే జరిపించినట్లు వారు పేర్కొన్నారు. గతంలో కోటి 54 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టగా కొందరు రైతులు సీసీ రోడ్డుకు బదులు బీటీ రోడ్డు వేయాలని పట్టుపట్టడంతో కొంత ఆలస్యం జరిగిందని అలాగే పనులు జరుగుతున్న సమయంలో సబ్ కాంట్రాక్టర్ మృతి చెందడం వల్ల రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని వారు పేర్కొన్నారు. ఈ రోడ్ల మరమ్మతులకు రైతులు సహకరించినట్లయితే తొందరలోనే రోడ్ల మరమ్మతులు పూర్తి చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు ఎమ్మెస్ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు రఫిక్, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షులు కాశం సాయిలు, బోధన్ మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రశాంత్, డైరెక్టర్ సమ్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు టి.అంజయ్య, చందూర్ సంతోష్, సొసైటీ డైరెక్టర్ అగ్గు నారాయణ, స్థానిక నాయకులు శేఖర్, రాము, సాయగౌడ్, నారాయణ, ప్రభాకర్, గంగారెడ్డి, వేణు, షబ్బీర్, బాలొరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-సదాశివనగర్



పోచయ్య (ఫైల్)

అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కల్వరాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఎరుకల పోచయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాగా కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాకేష్ గల్ఫ్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లాడు. కాగా కుమారుడు వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే పోచయ్య మృతిపట్ల ప్రజలు కంటతడిపెట్టారు.

అంగన్వాడీ కేంద్రంలో చోరీ



నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని యాచారం గ్రామంలో బుధవారం రాత్రి అంగన్వాడీ కేంద్రంలో చోరి జరిగినట్లు సర్పంచ్ లత గురువారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అంగన్వాడీ కేంద్రం తాళాలు పగుల గొట్టి అందులో ఉన్న నూనె, గుడ్లు, బియ్యం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. అంగన్వాడీ పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల తాళం పగులగొట్టి, దుస్తులు, బియ్యం ఎత్తి కెళ్ళి నట్లు తెలిపారు. ఈ విషయం పోలీసులకు సమాచారం ఇచ్చామని సర్పంచ్ పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని రెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులను ఎంపీపీ దశరథ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నారని, అభివృద్ధిలో భాగంగా రెడ్డి పేట గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.10 లక్షల సీసీ రోడ్డుకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. వర్షాకాలంలో గజ్జలమ్మ తోట లో ప్రజలకు ఇబ్బందిగా ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించి సీసీ రోడ్డు పనులను చేపట్టారని అన్నారు. కాంట్రాక్టర్ నాణ్యత కూడిన పనులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునంద ప్రభాకర్ రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు గర్గుల రాజా గౌడ్, ఉప సర్పంచ్ బాలయ్య, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, గ్రామ అధ్యక్షులు లింబాద్రి, రాజేందర్, రామడుగు హనుమాన్లు, రాజనర్సు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

రెండోరోజుకు రైతుల రిలే నిరాహార దీక్ష

నవతెలంగాణ-రెంజల్



దీక్షలో పాల్గొన్న రైతులు

రైతు పంట పొలాలకు వెళ్లే బందల్లా రోడ్డు, మాచాపురం, దూపల్లి ఎక్స్‌రోడ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల కేంద్రంలోని రైతులు గాంధీ విగ్రహం ముందు చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి రెండవ రోజుకు చేరుకుంది. గత ఎనిమిది సంవత్సరాల కిందట కోటి 54 లక్షల రూపాయల నిధులు మంజూరు కాగా, సబ్ కాంట్రాక్టర్ మృతి చెందడం, కరోనా రావడం లాంటి సమస్యలు ఎదుర్కోవడంతో తీవ్ర జాప్యం జరిగిందని, చిన్న సన్న కారు రైతుల పంట పొలాలు ఎక్కువగా ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉంటుందని, పనుల జాప్యంతో తాము నానా అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయానికి గురువారం భిక్కనూర్ పట్టణానికి చెందిన గంగెల్లి జగదీశ్వర్ ఉమారాణి దంపతులు, జగదీశ్వర్ కుమారుడు, కోడలు వీర ప్రసాద్ మౌనిక దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.50,116 విరాళాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన దంపతులను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్, అర్చకులు సిద్ధగిరి శర్మ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ డైరెక్టర్ బసవయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన సంతోష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.62,500 ఎంపీపీ ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఏదైనా ప్రమాదవశాత్తూ ఆసుపత్రి పాలైన పేద మధ్య తరగతి కుటుంబాల వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు విడుదల చేసి ఆర్థికంగా ఆదుకుంటునట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కందరావ్ పటేల్, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌టీసీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్ లో డయల్ యువర్ ఆర్.టి.సి. కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 04 నుండి 05 గంటల వరకు నిర్వహిస్తామని ఆర్టిసి రీజినల్ మేనేజర్ ఉషా దేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు ఈ సదుపాయం సద్వినియోగము చేసుకొని తమ సమస్యలను సూచనలకు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ 9959226011, నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ 9959226013, ఆర్మూర్ డిపో మేనేజర్ 9959226019, బోధన్ డిపో మేనేజర్ 9959226001, నిజామాబాద్ -1 డిపో మేనేజర్ 9959226016, నిజామాబాద్ -2 డిపో మేనేజర్ 9959226017, కామారెడ్డి డిపో మేనేజర్ 9959226018, బాన్సువాడ డిపో మేనేజర్ 9959226020 ఫోన్ నెంబర్ లకు ఫోన్ చేసి తెలపాలని పేర్కొన్నారు.

బీసీ గుర్తింపునకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి

నవతెలంగాణ -నవీపేట్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గుర్తించిన 17 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ ఓ బి సి కమిషన్ చైర్మన్ డాక్టర్ హంసరాజ్ అహీర్ కు హైదరాబాదులోని హరిత ప్లాజాలో కలిసి గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కేంద్ర జాబితా ఓబీసీలో లేకపోవడం వలన విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులను ఓబీసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే తెలంగాణ ప్రభుత్వ బీసీ కమిషన్ ఇచ్చిన నలభై కులాల జాబితాను స్వీకరించి త్వరితగతిన ఓబీసీ జాబితాలో చేర్చుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ సభ్యులతోపాటు మోహన్ చవాన్, ప్రవీణ్, వేదాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి పార్టీకి తీరని లోటు

- **బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లి : సాయిచంద్ ఫోటోకి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వేల్పూర్‌లో సాయి చంద్‌కు నివళులు అర్పిస్తున్న నాయకులు

తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చందు మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో సాయి చందు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాయి చందు అకాల మృతి పట్ల విచారణ వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుడిగా, గాయకుడిగా తన ఆటపాటలతో ప్రజల్లో తెలంగాణ ఉద్యమాన్ని రగిలించడంలో సాయి చందు ముందున్నాడన్నారు. ఆయన మృతి యావత్ తెలంగాణకు తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లు గడ్డం స్వామి, పుప్పాల గంగాధర్, పెండే ప్రభాకర్, మారు శంకర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, చౌట్ పల్లి సింగిల్ విండో చైర్మన్ కుంట ప్రతాపరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మలావత్ ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ గాయకుడికి నివాళి

నవతెలంగాణ-వేల్పూర్

తెలంగాణ ఉద్యమ గాయకుడు గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్‌కు మండల కేంద్రంలో సాయి చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు నివాళి అర్పించారు. తన ఆట పాటతో తెలంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్య పరచి తన పాటతో ప్రజలను మేధావులను ఆలోచింప చేసిన సాయిచంద్ ఆకస్మిక మరణం తీరని లోటు అని, ఆయన తెలంగాణకు చేసిన సేవలు మరువ లేనివని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌టీఏ మెంబర్ రేగుళ్ళ రాములు, ఉప సర్పంచ్ పిట్ల సత్యం, ఎంపిటిసి మొండి మహేష్, ఆత్మ చైర్మెన్ నోముల రవీందర్, శ్రీనివాస్ గౌడ్ , సామ మహేందర్ మేతరి కార్తిక్, సౌడ దాస్, గజ్జెల గంగాధర్, కుర్మా గంగాధర్ , వెల్పూల ప్రసాద్ , అజీజ్ , సుంకరి రాము , నహీం , సి.హెచ్ రాజన్న , కమాలేష్, మోహన్ దాస్ , ప్రదీప్, పురుషోత్తం , క్రాంతి , పాల్గొన్నారు

టీయూ పాలక మండలి రద్దుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం



టీయూలో ధర్నా చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో జరుగుతున్నటువంటి అక్రమాలకు అన్యాయాలకు పరిష్కారం దొరికిందని అనుకుంటున్న వేళ పాలక మండలి రద్దు అనే విషయం ఎన్నో అనుమానాలకు దారితీస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం యూనివర్సిటీలో కొద్దిసేపు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 27 న రద్దయిన పాలకమండలిని 7 సార్లు ఏ విధంగా సమావేశం ఏర్పాటు చేశారని, ఇందులో తీసుకున్న నిర్ణయాలు ఎంతవరకు నమ్మొచ్చని అన్నారు. పాలకమండలి రద్దయితే దానిలో పాల్గొన్న ప్రతి వ్యక్తికి 16 వేల రూపాయల చొప్పున అప్పజెప్పి సుమారు 10 లక్షలకు పైగా యూనివర్సిటీ నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వీటిని వెంటనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.పాలకమండలి రద్దయిన విషయం ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్ కి తెలియదా అని? తెలిస్తే ఆయనే ఎందుకు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని యూనివర్సిటీ అభివృద్ధి, విద్యార్థుల అభివృద్ధి కోసం మంచి నిర్ణయాలు తీసుకొని విద్యార్థులకు అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.ఒకవేళ ఈ వారం రోజుల్లో గా దీనిపైన విచారణ జరిపి క్లారిటీ ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎ అధ్యక్షులు నిఖిల్, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు దినేష్, భీమ్ ఆర్మీ ఇంచార్జీ సురేష్, ఎస్ఎఫ్ ఐ నాయకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతికి సంతాపం



డిచ్‌పల్లి: సాయిచంద్‌కు సంతాపం తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-విలేకరులు

డిచ్‌పల్లి :రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్,తెలంగాణ ఉద్యమ కారుడు,గాయకుడు సాయిచంద్ హఠాన్మరం కలిచి వేసిందని ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువెరి గంగా దాస్ ప్రజా ప్రతినిధులు అన్నారు. గురువారం ఇందల్ వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సాయిచంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమం లో సీనియర్ నాయకులు పాశం కుమార్, కచ్చుకాయల శ్రీనివాస్, సంఘం కిష్టయ్య, పరుశురాం నాయక్, రమేష్ నాయక్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట్: తెలంగాణ ఉద్యమ కళాకారుడు, ప్రజా గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ ఆకస్మిక మృతికి బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ తెడ్డు పోశెట్టి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా గాయకుడు తన గానంతో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా కృషిచేసిన సాయిచంద్ ఆకస్మికంగా గుండెపోటుతో మరణించడం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా తెలంగాణ ఉద్యమ నేతగా నిలిచిపోతారని అన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

అభివృద్ధిని సహించలేకనే అసత్య ఆరోపణలు

నవతెలంగాణ-మెండోర

బాల్కొండ నియోజకవర్గంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులను సహించలేక రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్.శేఖర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందాలన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్, బిజెపి నాయకులు మంత్రి ప్రశాంత్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సెంట్రల్ లైటింగ్ , వంతెన నిర్మాణ పనులు చేసింది నిర్మల్ ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లు టెండర్లు వేసి నిర్మిస్తున్నారని వారు బీఆర్ఎస్ పార్టీకి సంబంధం లేనివారని తెలిపారు. కానీ బిజెపి నాయకులు అన్ని అభివృద్ధి పనులకు ఒకే కాంట్రాక్టర్‌కు ఇస్తున్నారని చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కమిషన్లు తీసుకోవాల్సిన అవసరం మంత్రికి లేదన్నారు. అభివృద్ధిని జీర్ణించుకోలేక కాంగ్రెస్, బిజెపి నాయకులు చౌకబారు ఆరోపణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అసత్య ఆరోపణలు మానుకోకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎంపిపి బురుకల.సుకన్య కమలాకర్ జడ్పిటిసి తలారి గంగాధర్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్లపల్లి. అరుణ నవీన్ గౌడ్, సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సాయరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు సామ.గంగారెడ్డి, ఉప సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో ప్రభుత్వాలు విఫలం

- **ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ**

నవతెలంగాణ-ఆర్మూర్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు .ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల మూడో వారంలో నిర్వహించనున్న చలో



సమావేశంలో మాట్లాడుతూన్న మందకృష్ణ మాదిగ

హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని వచ్చే పార్లమెంటు సమావేశాల్లో పెట్టి మాదిగల ఆకాంక్షను నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ నాగం రాజేష్, జిల్లా నాయకులు పోచంపల్లి శ్రీనివాస్, సుంకేపల్లి మున్నా, వేల్పుల శివ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌పై హత్యాయత్నం ఖండిస్తున్నాం

- **ఎమ్మార్పీఎస్**

నవతెలంగాణ-వేల్పూర్

చంద్రశేఖర్ ఆజాద్‌పైన కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ టీఎస్ దళిత నేత చంద్రశేఖర్ ఆజాద్‌పైన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో కాల్పులు జరిపి చంపడానికి ప్రయత్నం చేయడం దారుణమైన ఘటన అని అన్నారు. ఈ కాల్పులను టీఎస్ ఎంఆర్పిఎస్ తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎస్ ఎంఆర్పిఎస్ కోర్ కమిటీ సభ్యులు రేణిగుంట నాంపల్లి, టీఎస్ ఎంఆర్పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాల్కొండ నియోజకవర్గం ఇన్చార్జి మోతే భూమన్న తెలిపారు. ఈ అనగారిన ప్రజల హక్కుల కోసం తెగించి పోరాడే వీరులను చంపాలని చూడడం హేయమైన చర్య అన్నారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆజాద్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని కోరుతున్నామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయినట్లయితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జ్ సల్లూరి శ్రీనివాస్ జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్ బచ్చుపల్లి దేవయ్య, పొన్నాల సంజీవయ్య, కందుల రాములు, గుడిసె రమేష్ తదితరులు పాల్గొన్నారు

కంఠేశ్వర్: భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై ఉత్తర ప్రదేశ్‌లోని సహారాన్‌పూర్‌లో ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపి పారిపోయారని, వారు ఉపయోగించిన వాహనం గుర్తింపు ఆధారంగా నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ రోడ్లు భవనాల అతిథి గృహంలో భీంఆర్మీ కార్యకర్తల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ.. ఉత్తర ప్రదేశ్‌లో దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌పై దాడి వెనుక ఆధిపత్య కులోన్మాదులే ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీం ఆర్మీ జిల్లా అధ్యక్షులు సంజీవ్ ససానే , రాహుల్ ససానే, బిఎల్ఎఫ్ జిల్లా కన్వీనర్ కాంబ్లీ మధు,బౌద్ధ సొసైటీ రాష్ట్ర నాయకులు అశోక్ భాగ్య వన్,భీం ఆర్మీ నాయకులు సంజీవ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : ధర్న చేస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ టిఎస్ దళిత నేత చంద్రశేఖర్ ఆజాద్‌పై ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో సహరాన్పూర్ పట్టణంలో కాల్పులు జరిపి చంపడానికి ప్రయత్నం చేయడం దారుణమైన సంఘటన అని, ఈ కాల్పులను తీవ్ర ంగా ఖండిసు న్నామని ఎమ్మార్పీఎస్ టీఎస్ కోర్ కమిటీ సభ్యులు రేణిగుంట నాంపల్లి తెలిపారు. గురువారం నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణిగుంట నాంపల్లి మాట్లాడుతూ.. అణగారిన ప్రజల హక్కుల కోసం తెగించి పోరాడే వీరులను చంపాలని చూడడం హేయమైన చర్య అని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ఆజాద్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇన్చార్జి సల్లూరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్, మోతే భూమన్న, బచ్చుపల్లి దేవయ్య, పొన్నాల సంజీవయ్య, కందుల రాములు, గుడిసె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేల్పూర్‌లో మాట్లాడుతూన్న టీఎస్ ఎంఆర్పీఎస్ నాయకులు

నిజామాబాద్‌సిటీ : దళిత నేత చంద్రశేఖర్ ఆజాద్‌పై ఉత్తర ప్రదేశ్ హసన్ పూర్‌లో జరిగిన హత్య ప్రయత్నం ఘటనను ఖండిస్తున్నామని నగర మాల కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సఖి ప్రధాన కార్యదర్శి గైని దయాసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర మాల సంఘం తరపున హత్యాయత్నం చేసిన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దళిత ప్రజల మీద, నాయకుల మీద జరుగుతున్నటువంటి అరాచకాలను అరికట్టాలని, ఈ దాడులను ఆపే విధంగా కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని యూపీ ప్రభుత్వాన్ని కోరారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహాత్మ జ్యోతిభాపూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్సిఓ విజయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలుగు, ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఎకనామిక్స్, కామర్స్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బటాని, జూయలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రీషన్, కంప్యూటర్ సైన్స్, పీహెచ్డీ, ఎంఫిల్, నెట్, సెట్, స్లేట్ అర్హత కల్గిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఓపెన్ క్యాటగిరి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండి డిగ్రీ పీజీ కళాశాలలో పనిచేసిన అనుభవం మాత్రమే పరిగణించబడుతుందని, సర్వీస్ సర్టిఫికెట్ జతపర్చాలి, కళాశాల, సబ్జెక్ట్ అవసరాలను బట్టి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను డెమో ఇంటర్వ్యూకు పిలుస్తామని తెలిపారు. దరఖాస్తులను ఆర్సీఓ కార్యాలయంలో గానీ, ఎంజేపీ డిగ్రీ కళాశాల మునిపల్లి, నిజామాబాద్ లేదా ఎంజేపీ పాఠశాల జంగంపల్లిలో పొందవచ్చు అని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డిగ్రీ కళాశాలలో ఉన్న మునిపల్లి, నిజామాబాద్‌లో అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరఖాస్తులను ఆర్సీఓ కార్యాలయంలోగాని, ఎంజేపీ డిగ్రీ కళాశాలలో గానీ సమర్పించవచ్చు అని పేర్కొన్నారు. జూలై 07న డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని, మరింత సమాచారం కోసం 79817 10647, 6302342448 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

భక్తులతో కిటకిటలాడిన యంచ విఠలేశ్వరాలయం



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ విఠలేశ్వర ఆలయం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని యంచ గ్రామంలో పాండురంగని రెండవ పాదంగా పిలువబడే శ్రీ విఠలేశ్వర ఆలయం కొండపైన తొలి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు భక్త భజన మండలి చేసిన భజనలు భక్తులను అలరించాయి. కొండపైన సిసి రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో భక్తులకు ఎంతో సౌకర్యంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. ఆషాడ ఏకాదశి సందర్భంగా జిల్లా నుండి వివిధ ప్రాంతాలతోపాటు మహారాష్ట్ర నుండి భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చి విఠలేశ్వరున్ని దర్శించుకున్నారు. ఏకాదశి ఉపవాసం సందర్భంగా భక్తులకు శుక్రవారం ఉదయం అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లహరి ప్రవీణ్ కుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గోవింద్, లక్ష్మన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

కనీస వేతనాల పెంపుకోసం పోరాడుదాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కనీస వేతనాల పెంపుదలకు పోరాడుదామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ అన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యవర్గ సమావేశం శ్రామిక భవన్ కోటగల్లిలో గురువారం నిర్వహింఅచరు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మికుల కర్తవ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ... కార్మిక వర్గం వారికి అందుతున్న వేతనాలతో జీవనం కష్టంగా మారిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి పారిశ్రామిక హక్కుల చట్టాలను తీసుకొస్తుందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా, శ్రమదోపిడికి పాల్పడుతుందన్నారు. అన్ని రంగాల కార్మికులకు శాస్త్రీయంగా వేతనాల నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులకు వెంటనే కనీస వేతనాలు అమలు చేయాలన్నారు.నిజ జీవితాలకు సరిపడా కనీస వేతనాలు, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపుకై పోరాడుదామన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజ్ కోసం ఉద్యమించాలన్నారు. కనీస వేతనాల అమలు, పని భద్రతకై ఐఎఫ్టియు అనుబంధ సంఘాల కార్మికులతో త్వరలో హైదరాబాద్‌లో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న జిల్లా సహాయ కార్యదర్శి బీ.మల్లేష్, జిల్లా నాయకులు కిషన్, సత్యక్క, లక్ష్మణ్, మురళి, సాయరెడ్డి, కిరణ్, అశోక్, బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతూన్న వనమాల కృష్ణ

తుపాకులతో బహుజన రాజ్యాధికారాన్ని ఆపలేరు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బహుజన యుద్ధ వీరుడు భీమ్ ఆర్మీ చీఫ్ , సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు అడ్వకేట్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్ పైన కాల్పులు జరిపిన మతోన్మాద ఉన్మాదులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు రాజేందర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సురేష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ పైన దాడి కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే దాడి జరిగిందన్నారు. ఆయనకు ఎటువంటి ప్రాణహాని జరిగిన కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తక్షణమే ఆయనకు జెడ్ కేటగిరి సెక్యూరిటీ నీ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు ప్రసాద్, ఎఎస్ఎ అధ్యక్షులు వెంకటరమణ, ఎంఎస్ఎఫ్ అధ్యక్షులు దినేష్, నరేష్, విశ్వ, రాజేందర్, సిద్ధు, భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కు పంపిణీ

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే చేతుల మీదుగా మండల కేంద్రానికి చెందిన సాకలి శివరాంకు 16 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే హనుమంత్ షిండే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి అనారోగ్యానికి గురైన వారు ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కుల రూపంలో డబ్బులు అందజేసి అండగా నిలుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సహకార సంఘ అధ్యక్షులు శ్రీహరిబాలాజీ, మండల పార్టీ అధ్యక్షులు వెంకట్రావు దేశాయ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసవరాజ్ పటేల్, నాయకులు డాక్టర్ రాజు, సాకలి విఠల్ ఉన్నారు.